అరబండ్లు రాంగనే సవ్వన ధర బెంచుతరు. ఇగ అట్ల రైతులు ఏగిరపడి ఉన్నది లేంది ఊడ్చుకపోంగనే సవ్వన మూన్నూర్లు చేస్తరు...మనం ఇన్ని నీల్లు జల్లి అండాలు గట్టుకపోతమా? కిరాయులు బెట్టుకొని వత్తిమా? మల్ల ఎనకకు కొంటబోమని ధీమా! గొడగొడ ఏడ్చుకుంట ఆళ్ళన్నంత ధరకు ఏసత్తం..."

"ఊరూర సంగాలుబెట్టి ఊళ్ళె ఆళ్ళ ఆటలు సాగకుంటజేత్తిమి. మరి అందర మొక్కటైతే ఏదన్న చెయ్యలేమా?"

"ఎందుకు చెయ్యలేము...అన్ని సంఘాలు కూడబలుక్కొని గిట్టుబాటు ధరల గురించి కొట్లాడాలె..."

ఇట్లా కాసేపు మాట్లాడుకున్నారు.

"ముండ బొడ్డికి దండంబెడితె నాతీరు గుండుమని దీవెన బెట్టిందట - మీబావ కన్నీ అనుమానాలే - ఏర్గబోను ఏడుగునాత్తాలు జేత్తడు. గీనెలో నేందన్నా బుజారంనాడు కాయలు కొండబోదాం." అన్నది సత్తెమ్మ - మల్ల కొట్లాట గిట్లాట అంటండు - కాయలీడబెట్టి తిరుగుతడే మొననుకొని.

"ఔ బావా! రాజిరెడ్డి సంగతేమన్న తెల్సిందా. బాల సంఘపోల్లు ఇజ్జత్ తీత్తండ్లు గదా! ఏడాదాయె మనకు దూరమయ్యి ఇంకోడైతే ఊకుండురా! పంచాతుబెట్టి మీకు మాకు రాం రాం అని చెప్పకపోదురా! ఎంతైనా సదువుకున్నోడు సదువు కున్నోడే...కిందబడ్డా బంచోతే మీదబడ్డా బంచోతే.' నర్సయ్య గుసగుసగా అన్నాడు.

"మనకు చెరువు దెచ్చేదనుక చూద్దాం." పెంటయ్య...

'బాగున్నది పని వరుస...సంగపెద్దవు నువ్వే గిట్లంటెట్ల? దొంగలుబడ్డ అర్నేల్లకు మనం కండ్లు తెరిత్తెట్ల...చెరువు ఎంత తెత్తడో ఎవలకెరుక - ఇగో గిట్ల ఇడిసిపెడితె ఒక్కొక్కడు గట్లనే ఎల్లిపోయి సంగంపేరు చెప్పుకొని దందాలు చేత్తరు. పబ్లిక్కేమొ ఎవడు మనోడో ఎవడు మందోడో తెలియదు. అయింక మనం సిక్కుల్ల బడ్తం. ఇగో రాజిరెడ్డికి పెద్ద పెద్దోల్లతోనే సోపతి - మనదెంత కోన్‌కిస్కేగాళ్లం." కండ్లు వులపాడిసి నర్సయ్య అన్నాడు.

"అంటే..."

"కోప్పడకు బావా! పార్టోల్లు రాజిరెడ్డికి ముందుగాలెరుగ - మనకు ఎనుక - మనకన్న రాజిరెడ్డికే ఎక్కువ..."

"అయితే..." పెంటయ్య నోరుతెరిచి.

ఎందుకో పోబుద్ది కాలేదు. ...

బస్సు కదిలింది.... రాజిరెడ్డి ఒక్కడే మిగిలాడు. .... మనుసింకా కుతకుత ఉడుకుతూనే వుంది. ఏడాది నుండి మసిలి మసిలి మరింక ముసుగు లో గుద్దులాటలుండొద్దు -ఎక్కడో ఒక దగ్గర గండి కొట్టాలి ..... ఈ సూటిపోటి మాట లేంది? ఈకోర చూపులు ఒద్దు .... ఊళ్ళె వుండు మంటరోలేదో తేల్చుకోవాలే-జిట్టెడు లేని పోల్లగండ్లు ఎంట బడుడేంది? నేను లేకుంట జూసి ఇంటిమీద దాడి చేసుడేంది? ఈ బాలసంఘం బెట్టింది తను....తన మీదికే పోరగండ్లు ఉల్టాదిరిగిండ్లు . ఆటుబోతే అమీనుగాడు వాడెరికేనా వీడెరికేనా అని అడుగుతడు. మూడుకేసులు అట్లనే వున్నయి. పోని పార్టికేమన్నా ద్రోహం చేసిపోతిమా? -గాతనైనంత జేసినా...మరింకా చాతకాదంటే వినరే..... ఏదో ఒకటి చెయ్యాలెగన్క సారా బిజినెస్‌ల దిగిన ...రాజిరెడ్డి తనలో తానే తర్కించుకుంటూ నడుస్తున్నాడు.

పందిల్ల కింద , గుడిసెల చూర్ల కింద కూర్చున్న జనం ఏదో చెప్పుకుంటున్నారు. ఆమాటలేమిటో స్పష్టంగావిన్పించడం లేదు. కానితన గురించే చెప్పుకుంటున్నారని అనుకున్నాడు."వీళ్ళకేం తెలుసు మార్క్సిజం-ఇయ్యాల్ల అందరు మొనగాల్లే అయ్యిండ్లు-రాజిరెడ్డి దొంగయ్యిండు. రాజిరెడ్డి త్యాగాలు పోయినయ్-రాజిరెడ్డి తిన్న తన్నులు బోయినయ్...... జనం స్వార్థపరులు.... వాళ్ళ భూముల కోసం రాత్రనక పగలనక తిరిగింది పోయింది.....

జనం సంగతట్లా వుంచితే నాయకులో ....పిల్లలను పిలిచి రాజిరెడ్డి మనోడనని కోప్పడవద్దా -ఇంతకు హెళ్లు ఏమనుకుంటున్నారు? తను శత్రువు ననుకొంటండ్లా? మిత్రుడనా? ఇయ్యాల్ల అటోయిటో తేల్చుకోవల్సిందే..... అంతవరదాకా గమ్యం లేకుండ నడుస్తున్న రాజిరెడ్డి ఆ ఆలోచన కలుగగానే పెంటయ్య ఇంటికేసి నడిచాడు....

వాకిట్లో నిలబడి "పెంటయ్యా..... పెంటయ్యా...." అని గట్టిగా పిలిచాడు.

బువ్వ తింటున్న పెంటయ్య ఎంగిలిచేతితోనే లేచి వచ్చిండు.వాకిట్లో వీధి లైటు వెలుతురులో పరెషాన్లో ఉన్న రాజిరెడ్డి ముఖం చూసి "రా లోపలికి రా..."అన్నాడు పెంటయ్య.

"వచ్చేదేంది....గని ఇగో పెంటయ్య మీకునాకు రాంరాం మంచో చెడ్డో ...."రాజిరెడ్డి ఆదర బాదరగా ఏదో చెప్పబోయాడు.

చెడుపు - మన సారుకు ఖుల్లం ఖుల్ల చెప్పుకోవాలె-" ఇట్లా చెప్పుకొచ్చాడు.

"అయితే రాజిరెడ్డిని తప్పన్నరుగద - గుడ్డపేగులోల్లు వీల్లతో నేందయిత దనుకుంటడు - అయినె ఉండంగ తనమాట తనదేగాని మామాట జొరనిచ్చిండా?" నర్సయ్య.

"మరిగట్ల చేత్తండని ఎప్పుడన్న బయటపెట్టిండ్లా?" నీలయ్య. "ఏడ ఏమంటె ఏమత్తదోనని " అయిలయ్య.

"గందుకనే కొండముదిరి ఊసరెల్లయ్యింది." రాజీరు.

అప్పుడు దాదాపు అందరు "రాజిరెడ్డిని సంగంలకు తీసుకోవద్దు." అని చెప్పుకొచ్చారు. కొందరు ఏమేమి చేసిండో చెప్పుకొచ్చిండ్లు -

నీలయ్య, శేఖర్ ఓపిగ్గా విన్నారు. రాజిరెడ్డి గురించి చాలా విషయాలు తెలిశాయి.

ఆఖరున పెంటయ్య కల్పించుకొని - "మీరంతా చెప్పింది బాగానే ఉన్నది - రాజిరెడ్డిని మల్ల గింతమంది దగ్గెరికే పిలిసి అడుగవచ్చు. అయితె చెప్పేటియి అయినె చెప్పుతడు - మనం చెప్పేటియి మనం చెప్పుతం. మనం నీకు మాకు పొత్తు కుదరదని తెగేసి చెప్పుతం - అయినె ఊల్లె ఇగో నేను మల్ల పని చేత్తనంటే సంగపోల్లు పడనిత్తలేరని పచారం చేత్తడు. రైతు కూలి సంగమంటే మల్ల కొద్ది మందిమే ఉంటం - ఇది ఊరందరికి కావాల్సిన సంగతి మల్ల నచ్చినోల్లను సంగంల కలుపుకుంటరు - ఇట్టంలేనోల్ల వద్దు పొమ్మంటరు - మమ్ముల అడిగిండ్లా అని ప్రజలంటరు. అదిగాక మనతోటి కలిసి తిర్గిండుగన్క మొకంమీద అసలేం - గిసొంటి సంగతి పజలందరికి తెలుత్తెమంచిది - ఎవల పొట్టల ఏమున్నదో మనకెట్ల తెలుస్తది -" చెప్పుకొచ్చాడు.

"కామ్రేడ్స్ రేపు పగలు ఊళ్ళోలందరిని కుప్పచేసి అన్ని సంగతులు ప్రజల ముందు పెడుదాం - అందర్ని స్వేచ్ఛగా వాళ్ల వాళ్ల అభిప్రాయాలు చెప్పుమందాం - అంతిమ నిర్ణయం ప్రజలకే ఒదిలిపెడుదాం -" శేఖర్ -

"ఈ ముచ్చెట బాగున్నది సారూ !" అయిలయ్య-

'అయింక మాదేవున్నది అని సేతు లెల్లెలుకల ఎయ్యరు గదా!' మొగిలి నవ్వుతూ-

" మాదండి మొగోడచ్చిండు మంచ మెల్లెలుకలేయి మన్నదట-" నర్సయ్య మొగిలికి అంటించాడు-

